

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 30 | అక్టోబర్ | 2025 పేజీలు : 8

# నిండా ముంచిన మొంథా..!

-నేలపరిచిన కోతకు వచ్చిన వరి పొలాలు
-భారీ వర్షానికి ఉమ్మడి జిల్లాలో పొంగి పొర్లుతున్న వాగులు, నదులు
-మున్నేరుకు వరద ఉధృతి









2 లో

## డిసెంబర్ 26న ఖమ్మం నగరానికి దండుగా కదులుదాం




- బస్తీలు, పల్లెల్లో సిపిఐ వందేళ్ల ఉత్సవాలు ఘనంగా జరపాలి
- ప్రజాక్షేత్రంలో విస్తృతంగా ప్రచారం చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సిపిఐ శత వసంత సుంబురాలను పురస్కరించుకుని రానున్న డిసెంబర్ 26వ తేదిన ఖమ్మం నగరంలో జరిగే ముగింపు సభను ప్రతి పల్లె, బస్తీ నుండి దండుగా కదలాలని, ఇందు కోసం పార్టీ శ్రేణులు నిరంతరం శ్రమించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో శేషగిరి భవన్‌లో జరిగిన కొత్తగూడెం పట్టణ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యాతిథిగా పాల్గొని మాట్లాడారు. సిపిఐ శంతవసంతాల ఉత్సవాలు కేవలం పార్టీ వేడుకులుగా కాకుండా ప్రజల ఉద్యమ చరిత్ర గుర్తు చేసే సమయంగా ఉండాలని, ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాటాలు నిర్వహించిన సిపిఐ చరిత్ర నేటి తరానికి ఆందర్శంగా ఉండేలా గ్రామ స్థాయిలో ఉత్సవాలు నిర్వహించాలని, వందేళ్ల ఉత్సవాలు సిపిఐ ఆలోచనలు, విలువలను కొత్త తరం వరకు తీసుకెళ్లే అవగాహన కార్యక్రమాలుగా మలచాలని సూచించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ డిసెంబర్ 26 వరకు సిపిఐ శ్రేణులు ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రచారాన్ని

మిగతా 2లో..



# నిండా ముంచిన మొంథా..!





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రకృతి మరోసారి తన ప్రకోపాన్ని చూపింది. మొంథా తుఫాన్ రూపంలో బీభత్సాన్ని సృష్టించింది. ఈ ఏడాది అతివృష్టి కారణంగా ఇప్పటికే మెట్ట పంటలు దెబ్బతినగా ఇప్పుడు వరి సాగు చేసిన రైతులను నిండా ముంచింది. తుఫాన్ దెబ్బకు వరి పొలాలు నేలవాలాయి. పూర్తిగా కోతకు వచ్చిన పొలాలు నేల వాలడం పైనుంచి నీళ్లు పారుతుండడంతో అపార నష్టం జరగనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరిపైనే ఆశలు పెంచుకున్నామని ఆ ఆశలను సైతం తుఫాన్ గల్లంతు చేసిందని రైతులు వాపోతున్నారు. మిర్చి తోటలు సైతం తుఫాన్ గాలికి పక్కకు ఒరిగాయి. మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం రాత్రి నుంచి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా ఎడతెగకుండా వర్షం కురుస్తుంది. వర్షానికి తోడు భారీగా ఈదురు గాలులు వీస్తుండడంతో జన జీవనం స్తంభించింది. భారీ వర్షాలకు వర్షపు నీటితో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖమ్మం నగరంతో పాటు మధిర, వైరా సహా పలు ప్రాంతాలలో వర్షపు నీరు కారణంగా పల్లపు ప్రాంతాలలో నివసిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా కామేపల్లిలో తొమ్మిదిన్నర సెంటిమీటర్ల వర్షపాతం నమోదు కాగా ఖమ్మంజిల్లాలోని అన్ని మండలాల్లో వర్షం కురిసింది. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో వర్షపు నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి వర్షపు నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. ఖమ్మం జిల్లాలో 16 చోట్ల రహదారులపైకి నీరు చేరడంతో రాకపోకలను నిలిపివేశారు. కామేపల్లి మండలంలోని బుగ్గవాగు ఉధృతికి ఖమ్మం డోర్నకల్ మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. ఖమ్మం సమీపంలోని మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. బోనకల్ మండలంలోని పెద్దవాగుకు భారీగా వరద రావడంతో పలు చోట్ల రహదారులను ముంచేసింది. అధికార యంత్రాంగం అప్రమత్తమై రాకపోకలను నిలిపి వేశారు. చింతకాని మండలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద వాగు ఉధృతికి లారీ కొట్టుకుపోయింది. లారీతో పాటు డ్రైవర్ కూడా గల్లంతయ్యాడు. బుగ్గవాగు ఉధృతిని సిఈవో దీక్షారైనా పరిశీలించగా మున్నేరు వరద నీటిని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులతో కలిసి పరిశీలించారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండడంతో మున్నేరు ప్రమాదకర స్థితికి చేరుతుందని జలగం నగర్, కెబిఆర్ నగర్, గ్రీన్ కాకతీయ తదితర ప్రాంతాలలో కలెక్టర్ పర్యటించారు. 1077, 9063211298 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించి సాయం పొందాలన్నారు. పాలేరుకు వరద ఉధృతి పెరిగింది. భారీగా వరద రావడంతో 24 గేట్లను ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. తల్లాడ మండలంలో వాగుల ఉధృతిని స్థానిక ఎంపిడివో ఏనుగు సురేష్ బాబు తో కలిసి ఆశాలత లు పరిశీలించారు. పెనుబల్లి మండలంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో లంకా సాగర్ ప్రాజెక్టును సబ్ కలెక్టర్ పరిశీలించారు. మధిర పట్టణంలో ముస్లిం కాలనీ, హనుమాన్ కాలనీ తదితర ప్రాంతాలు జలమయమైన అధికారులు స్పందించకపోవడంతో ప్రజలు రోడ్డెక్కి వైరా, మధిర రహదారిపై ఆందోళన నిర్వహించారు. దీనితో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. మున్నేరు 17 అడుగులకు చేరుకోవడంతో ఖమ్మం నగరంలోని మున్నేరు బాధిత ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులకు వరద ముంపు పొంచి ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో భారీ వర్షాల కారణంగా పలు చోట్ల రైలు పట్టాల మీదకు వర్షపు నీరు చేరడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మధిరలో షిర్డి ఎక్స్‌ప్రెస్‌ను నిలిపి వేయగా ఖమ్మం సమీపంలోని డోర్నకల్‌లో గొల్కొండ, కొణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపి వేశారు. ఖమ్మంకు 110 కిలో మీటర్ల దూరంలో తుఫాన్ కేంద్రీకృతమైందన్న వార్తల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు పలు సూచనలు చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. పల్లపు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచిస్తున్నారు. మొత్తంగా మొంథా తుఫాన్ ఖమ్మం జిల్లాలో బీభత్సన్ని సృష్టించింది.

# డిసెంబర్ 26న ఖమ్మం నగరానికి దండుగా కదులుదాం




**(మొదటిపేజీ తరువాయి)**

పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. వందేళ్ల ఉత్సవాన్ని వేదికగా చేసుకుని కార్మికులు, కూలీలు, రైతులు, ఉద్యోగులు, యువత, మహిళా సమస్యలపై విస్తృతంగా చర్చలు, సదస్సులు, ర్యాలీల ద్వారా ప్రజా చైతన్యం పెంచాలనిసూచించారు. ప్రతీ వార్డు ప్రతి గ్రామంలో ఎర్రజెండా ఎగుర వేయాలని, సిపిఐ శతాబ్ధి ఉత్సవాలను ప్రజల పండుగగా మార్చాలని కూనంనేని పిలుపుని చ్చారు. మర్రి గోపికృష్ణ, మాచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ కార్య దర్శి కంచర్ల జమలయ్య, గెద్దాడు నగేష్, రమణమూర్తి, నేరెళ్ల రమేష్, వంగ వెంకట్, కందుల భాస్కర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జోరు వానలో కార్మికులను కలిసిన ఏఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారీ వర్షాల కారణంగా పలు చోట్ల పారిశుధ్యంతో పాటు ఇతరత్రా సమస్యలు తలెత్తడంతో జోరు వానను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న కార్మికులను ఏఐటియుసి నాయకులు కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా మున్సిపల్ కార్పొరేటర్ బిజి క్లెమెంట్ మాట్లాడుతూ భారీ వర్షం నుంచి ఇబ్బందులు పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని కార్మికులకు సూచించారు. రెయిన్‌కోట్లు, బూట్లు, గ్లౌజులను తప్పని సరిగా ఉపయోగించాలన్నారు. నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేస్తున్న కార్మికులను ఆయన అభినందించారు. కార్మికులను కలిసిన వారిలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, కటుకూరి సతీష్‌రెడ్డి, వీరన్న తదితరులు ఉన్నారు.

## గిరిజన విద్యార్థికి ప్రతిభా పురస్కారం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల కేంద్ర మైన రఘునాథపాలెంలో గల గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల విద్యార్థి డేగవత్ సంజీవ్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ ప్రతిభ కనబర్చిన పదవ తరగతి నిరుపేద విద్యార్థులకు సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజక వర్గాల పరిధిలోని విద్యార్థులకు ప్రతిభా పురస్కా రాల పేరిట రూ. 30వేల నగదుతో ప్రోత్సాహకాలను అందించారు. ఖమ్మం నియోజక వర్గం నుండి రఘునాథపాలెంలో గల గిరిజన పాఠశాల విద్యార్థి డేగవత్ సంజీవ్ 576 మార్కులతో మండలంలో టాపర్‌గా నిలిచారు. మహబూబాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం కొల్లగట్టు తండాకు చెందిన శంకర్ మంగమ్మ దంపతుల కుమారుడు సంజీవ్ గురుకులంలో సీటు పొంది ఎనిమిది నుంచి పది తరగతుల వరకు విద్యనభ్యసించాడు. తండ్రి చనిపోయిన తల్లి కష్టపడి కుమారున్ని చదివించింది. ఉత్తమ ప్రతిభతో సంజీవ్ ప్రస్తుతం మహబూబ్ నగర్‌లోని ట్రిపుల్ ఐటిలో సీటు సాధించాడు. ప్రతిభా పురస్కారం అందుకున్న విద్యార్థి సంజీవ్‌ను బుధవారం గురు కుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాల స్వామి, వైస్ ప్రిన్సిపాల్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి**
**-కలెక్టరేట్‌లో 1077, 9063211298 టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదతో మున్నేరు ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో మున్నేరు పరివాహక ప్రాంతంలో ముందస్తు జాగ్రత్తల కోసం బుధవారం ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు, మున్నేరు ఘాట్, గణేష్ నిమజ్జన ఘాట్, బొక్కలగడ్డ, ఖమ్మం రూరల్ మండలంలోని జలగం నగర్, గ్రీన్ కాకతీయ నగర్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పర్యటించారు. మున్నేరు బ్రిడ్జి వద్ద వరద నీటి ప్రవాహాన్ని, నీటి మట్టం స్థాయిని కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. ఎగువ నుండి వరద పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులకు సహకరించాలన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో ఖమ్మం వద్ద మున్నేరు 18 అడుగుల మేర ప్రవహిస్తుందని మరో రెండు అడుగులు పెరిగే అవకాశం ఉందన్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా స్పందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. అత్యవసర సమయంలో ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌లో 1077, 9063211298 టోల్ ఫ్రీ నెంబర్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో జి. నర్సింహారావు, ఖమ్మం మున్సిపల్ సహాయ కమిషనర్ అనిల్ కుమార్, ఖమ్మం, అర్బన్ రూరల్ తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, మున్సిపల్, పోలీస్, ఇరిగేషన్ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి ప్రవాహాలను దాటొద్దు : సిపి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లాలో కురుస్తున్న భారీవర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంతెనలపై వరద ప్రవాహాలను దాటే ప్రయత్నం చేయవద్దని పోలీసు కమి షనర్ సునిల్‌దత్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల పాటు తుఫాన్ ప్రభావం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు పోలీసులకు సహాకరించాలని సూచించారు. పశువుల కాపరులు వాగులు, నీటి ప్రవా హాల వద్దకు వాటిని తీసుకువెళ్లవద్దన్నారు. యువత సెల్ఫీల కోసం పరివాహక ప్రాంతాలకు వెళ్లి ప్రమాదాల భారీన పడవద్దని సూచించారు. వాగులు, వంకలతో పాటు నీట మునిగిన రహదా రులను దాటే ప్రయత్నంచేయవద్దన్నారు. ఇప్పటికే వాగులు, చప్టాల వద్ద వంతెనలపై రాకపోక లను నిలిపివేస్తూ హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు ఉంచామ న్నారు. పెట్రోలింగ్ పెంచామన్నారు. పిల్లలను ఇంటి నుంచి బయటికి రాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలో పలుప్రాంతాల్లో రోడ్లు జల మయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడకుండా రాకపోకలకు అంతరాయం కలగ కుండా ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నారని పెర్కొన్నారు. పోలీసులకు నగర వాసులు, జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు. అత్యవసర సమయంలో డయల్ 100, స్థానిక పోలీసులకు, పోలీసు కంట్రోల్ రూమ్ సెల్ నెంబర్ 8712659111, కలెక్టర్ ఆఫిస్ టోల్‌ఫ్రీ నెంబర్ 1077, సెల్ నెంబర్ 906321198 లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి

**-అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**




**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా నిర్వ హించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ అన్నారు. కలెక్టరేట్ లోని ప్రజ్ఞా మీటింగ్ హాల్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆధ్వ ర్యంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించగా బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ బి కళావతిబాయి, గవర్నమెంట్ హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్ ఎం నరేందర్, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ ఎం కోటేశ్వరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందునాయక్, డాక్టర్ పి వెంకటరమణ, డాక్టర్ పి రామా రావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ రవీందర్, ఎడబ్ల్యూఎం కన్సల్టెంట్ షారుఖ్ గజ్జర్, పర్యావరణ ఇంజనీరు ఎం శ్రీనివాసరావు, ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం సరఫరా సజావుగా జరగాలి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు సన్నబియ్యం సరఫరా సజావుగా జరిగేలా చూడాలని

**అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**
**- ముత్తగూడెంలో ఎంఎల్ఎస్ సెంటర్ ప్రారంభం**

ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ముత్తగూడెంలోని ఎఫ్‌సీఐ గౌడంలో నూతన సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా సకాలంలో పూర్తి చేసేందుకు ఏర్పాటు చేసిన ఎంఎల్ఎస్ పాయింట్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సెంటర్ గతంలో ఖమ్మంనగరంలోని నర్తకి థియేటర్ వద్ద ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత, సంబంధిత అధికారులు, డీలర్లు వెంకన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, కందుకూరి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణిలకు అండగా ఎర్రజెండా



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : పేదోడి అండ...దండ ఎర్రజెండా అని తెలిసిందే..కానీ ప్రయాణికులకు కూడా అండదండ ఈ ఎర్రజెండా అనేలా మారిపోయింది. అది ఎలా?అంటారా? ఖమ్మంసూర్యాపేట రహదారిపై ఏర్పడిన ఓ పెద్ద గుంత ద్వారా స్పష్టమైనది. జోరున కురుస్తున్న వర్షంలో సైతం ప్రయాణికుల పట్ల కమ్యూనిస్టులు చూపిన చొరవ ఆ ఎర్రజెండా గొప్పతనానికి నిదర్శనంగా నిలిచింది. వివరాల్లోకి వెళితే ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం సమీపంలోని చౌరస్తాలో రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆ రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాలు అందులో పడి గుల్లవుతున్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలతో ఆ గుంత మొత్తం నీటితో నిండిపోయింది. ఈ క్రమంలో వాహనాల

- **ఖమ్మం సూర్యాపేట రహదారిపై ఏర్పడిన పెద్దగుంత**
- **వాహనాలకు ఇబ్బందులు కలగకుండా డ్రమ్ము ఏర్పాటు**
- **సిపిఐ నేతలు చూపిన చొరవపై అభినందనల వెల్లువ**
- **సెప్టెంబర్ 29న కథనం సైతం ప్రచురించిన ప్రజాపక్షం**



ప్రయాణం భయానకంగా మారింది. దీన్ని గమనంచిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్‌తో పాటు అక్కడి ఎలక్ట్రికల్‌షాప్ యజమాని బబు తారాం ఓ వాటర్ డ్రమ్మును ఆ గుంతపై పెట్టారు. అంతేకాకుండా ఎలక్ట్రికల్ పైపులను ఆ డ్రమ్ములో పెట్టి ఎర్రజెండాను తొడిగి, ప్రమాదసూచికగా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వాహనాలు అది చూసి పక్క నుంచి వెళ్లాయి. ఈ సందర్భంగా వాహనదారులు చేపట్టిన మంచి పనిపై హర్షం వ్యక్తం చేశారు. కాగా ప్రజాపక్షం దినపత్రికలో సైతం సెప్టెంబర్ 29న కథనం ప్రచురితం అయ్యింది. అటు తర్వాత అధికారులు తూతూ మంత్రంగా గుంతలను పూడ్చి వదిలేశారు. ఇప్పటికైనా అధికారులకు కనువిప్పు కలిగించుకుని, సమస్యను పరిష్కారం చేయాలని పలువురు కోరుతున్నారు.

# అకాల వర్షాలతో అన్నదాతల ఆందోళన

ప్రజాపక్షం/ముదిగొండః కొన్ని రోజులుగా రైతులను అకాల వర్షాలు ఆగమాగం చేస్తున్నాయి. దీంతో అన్నదాతల తీవ్ర ఆందోళన పాలవుతున్నారు. మండలంలో వరి, మిర్చి, పత్తి పెద్ద ఎత్తున్న దెబ్బతిన్నాయి. మండలంలో సుమారు వరిపంట 50 వేల ఏకరాలు, పత్తి పంట 17 వేల ఏకరాలు సాగు చేయగా, మిర్చి పంట 2 వేలు ఏకరాలు రైతులు సాగు చేశారు. ఆరుకాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు రైతాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరికోత కోసిన రైతులు వడ్లను అరబెట్టానికి నానా అవస్థలు పడుతున్నారు. కోత కోసి పంటను ఆరబోసి.. విక్రయించుకునే వరకు రైతులు ఆకాశం వైపు చూస్తూ బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. బలమైన గాలులు, వర్షాల ప్రభావానికి వరిపంట నేలకొరిగింది. ఈ యేడాది పత్తిసాగు చేసిన రైతులు సరైన దిగుబడి రాక అప్పులు పాలయ్యారు. మిర్చిసాగు పెట్టుబడి రోజురోజుగా భారంగా మారిన పరిస్థితి ఏర్పడింది. మిర్చితోటలలో నీరు నిలబడి మిర్చి పంట నేలకొరిగి ఆకుల



రంగు మారి దెబ్బతింటున్నాయి. మరో మారు కురుస్తున్న అకాల వర్షాలకు మరింత దెబ్బ తగిలినట్లుగా పత్తిరైతుల పరిస్థితి ఎర్పడింది. మొత్తంగా ఈ యేడాది అన్ని రకాల పంటలు సాగు చేసేవారందరికీ తీవ్ర నష్టాలు చవిచూడాల్సిదేనట్లుగా పరిస్థితులు కన్పిస్తున్నాయి.

# వరద ముంపు సమస్యను పరిష్కరించాలని ధర్నా





ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాల్టీ పరిధిలోని 2వ వార్డు ముస్లిం కాలనీలో వరద ముంపు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కాలనీవాసులు మధిర వైరా ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు శీలం నర్సింహారావు, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ గత 40ఏళ్లుగా ముస్లింకాలనీ వాసులు వరద ముంపుతో సతమతమవుతున్నారని, చిన్నపాటి వర్షం వచ్చినా కాలనీలో వరదనీరు ఇళ్లల్లో చేరి నానా అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ముస్లింకాలనీ, హనుమాన్ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ తదితర వరద ముంపు ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారని, దీంతో వర్షాలు వచ్చినప్పుడు కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ ధర్నాతో సుమారు గంటసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో తహశీల్దార్ ఆర్.రాంబాబు, టౌన్ సిఐ రమేష్‌కుమార్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచి ఆందోళనను విరమిపం చేశారు. అనంతరం వరద ముంపు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు తక్షణ సహాయ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మందా సైదులు, డివిజన్ నాయకులు పాపినేని రామనర్సయ్య, పట్టణ కార్యదర్శి పడకంటి మురళీ, ఇతర నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## వరద ప్రవాహ ప్రాంతాల్లో పర్యటించిన తహశీల్దార్, ఎంపిడివో

ప్రజాపక్షం/వైరాః వైరా మండలం అష్ణగుర్తి వద్ద రాళ్లవాగు వరద ప్రవాహంతో ప్రవహించడంతో వైరా తహశీల్దార్, ఎంపిడివో సక్రియ ఆ ప్రాంతానికి వెళ్లి రాకపోకలను నిలిపివేశారు. గ్రామ పంచాయాతీ సెక్రటరీని అందుబాటులో ఉండేవిధంగా ఉండాలని ఆదేశించడంతో పాటు ఎవరు పోకుండా ట్రాక్టర్లను అడ్డు



పెట్టి పెట్టి నిలిపివేశారు. అదేవిధంగా స్నానాల లక్ష్మీ పురం, సిరిపురం గ్రామాల మధ్య వైరా నది ప్రవాహం పెరగడంతో ఆ ప్రాంత రాకపోకలను కూడా నిలిపివేశారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడివో సక్రియ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరద ప్రాంతాల్లోకి వెళ్లవద్దని పలు సూచనలు చేశారు.

## ప్రజలు జాగ్రత్తలు పాటించాలి : ఎస్సై

ప్రజాపక్షం/వైరాః తుఫాన్ నేపద్యంలో ప్రజలందరూ తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వైరా ఎస్సై పుప్పాల రామారావు అన్నారు. మొంథా తుఫాన్ నేపద్యంలో ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. వేలాడుతున్న విద్యుత్ తీగల వద్దకు వెళ్లవద్దు, ఎమర్జెన్సీ మెడికల్ కిట్ ప్రక్కనే ఉంచుకోవాలి. విలువైన వస్తువులు భద్రపరచుకోవాలి, రైన్‌కోర్టులు దుప్పట్లు సిద్ధంగా ఉంచుకోవాలి. కాని చల్లార్చి నీటిని త్రాగండి, అత్యవసర ఫోన్ నెంబర్లు వ్రాసుకొని దగ్గర ఉంచుకోండి, నీటిలో నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. గుంటలు కాల్వలు మాన్‌హోల్స్ ఉంటాయి. అధికారుల సూచనలు పాటించండి. సురక్షితంగా ఉండండి అని వైరా ఎస్సై రామారావు తెలిపారు.



## తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి నివాళి

ప్రజాపక్షం/వైరాః తెలంగాణ మాజీ మంత్రి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు హరీష్‌రావు తండ్రి సత్యనరాయణరావు మృతి పట్ల బానోతు మంజుల మదన్‌లాల్ సంతాపం వ్యక్తం చేశారు. తన్నీరు సత్యనారాయణరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని



ప్రార్థిస్తున్నానని సత్యనారాయణ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం మంజుల మదన్‌లాల్ మాజీ మంత్రి హరీష్‌రావుని పరామర్శించారు. సత్యనారాయణకి నివాళులు అర్పించిన వారిలో తన్నీరు జ్యోతి, కిలారు కిరణ్, కారుకొండ బోస్ తదితరులు ఉన్నారు.

## మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/ బోనకల్ : మొంథా తుఫాన్ వర్షాభావ పరిస్థితుల్లో మండల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ మద్దెల రమాదేవి తెలిపారు. మొంథా తుఫాన్ కారణంగా ఈదురు గాలులు ఎక్కువగా వీచే అవకాశం ఉన్నందున పాతపడిన ఇంటిలో, పాత గోడల వద్ద ఉండకూదని, కరెంట్ సంబంధించిన పనులు చేయవద్దని, కరెంట్ స్తంభాలను తాకకూడదని, చిన్న పిల్లలు బయట ఆడుకోవడానికి వెళ్లకుండా చూసుకోవాలని తెలిపారు. వర్షం పడుతున్నసమయంలో రోడ్డు మీద, చెట్ల కింద ఉండకూదని, కాలువలు, చెరువల వద్దకు



ఈతకు, చేపలు పట్టేందుకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ అధికారులు అందుబాటులో ఉంటూ ముంపు ప్రాంతాల గ్రామాలను పర్యవేక్షణ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలని, అవసరమైన చోట్ల సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు సెలవు ప్రకటించడంతో ఈ రెండురోజులు తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ వహించి బయటకు వెళ్లకుండా తగు జాగ్రత్తలో ఉండాలని మండల ప్రజలకు తెలిపారు.

## పొంగిన బండి రేవు

ప్రజాపక్షం/చింతకాని : మొంథా తుఫాను ప్రభావం వల్ల చింతకాని మండల వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. భారీ వర్షం నేపథ్యంలో నాగువంచ బండి రేవు పొంగడంతో నాగులవంచ పాతర్లపాడు మధ్య రాకపోకలను పోలీస సిబ్బంది నిలిపివేశారు. తహసీల్దార్ బాబ్జీప్రసాద్ , ఎస్సై వీరేందర్‌లు వరద ఉధృ



తిని పరిశీలించారు. చింతకాని జగన్నాధపురం మధ్య రహదారి కి అడ్డుగా పడ్డ భారీ వృక్షాన్ని పంచాయతీ సిబ్బంది, పోలీసులు తొలగించారు. ఈదురు గాలులకు వరి పంట పూర్తిగా నేలకొరగడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. మున్నేరు వరద ఉధృతి క్రమంగా పెరుగుతుంది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలెవరూ దూరప్రయాణాలు చేయవద్దని , చెరువులు వాగుల వద్దకు చేపల వేటకు వెళ్లవద్దని ఎస్సై వీరేందర్ మండల ప్రజలకు సూచించారు.

## స్థంభించిన జన జీవనం

**ప్రజాక్షం/పాల్వంచ :** బంగాళాఖాతంలో ఏర్పడిన మోంతా తుఫాన్ ప్రభావంతో మంగళవారం అర్ధరాత్రి నుండి విరామం లేకుండా వర్షం కురిసింది. దీనితో జనజీవనం స్థంభించిపోయింది. చలిగాలులు వీచడంతో ప్రజలు బయటకు రాని పరిస్థితి నెలకొంది. చేతికొచ్చిన పత్తి పంట తడిసిపోతున్నది. ఆరుగాలం కష్టించిన రైతాంగానికి అకాల వర్షం తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నది. తడిసిన పత్తికి డిమాండ్ లేకపోవటం తదితర కారణాలు రైతన్నకు తిప్పలు తప్పేటట్లులేదు. మండల పరిధి ఏజెన్సీ ప్రాంతాలైన చంద్రాలగూడెం, రేగులగూడెం మొదలుకొని దంతెలబోర, బంగ్రుగొండ తదితర 36 పంచాయితీలలో ముసురుకొన్న ముసురుకు ప్రజలు ఇండ్ల నుండి బయటకు రాలేకపోయారు. పాల్వంచ పట్టణంలో వీధి వ్యాపారులకు తీవ్ర విఘాతం కలిగింది. ఎడతెరిపిలేకుండా వచ్చి వర్షానికి తడిసి చలికి వణికిపోయారు. ప్రజలు బయటకు రాకపోవటంతో వ్యాపార నష్టం కలిగింది.

## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి : పాయం



**ప్రజాపక్షం/మణుగూరుః** మోంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉన్నందున, ఎవరూ వాటిని దాటే ప్రయత్నం చేయవద్దు అన్నారు. అలాగే, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారు ఎవరైనా ఉంటే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేసి, నిరంతరం పర్యవేక్షణ జరిపేలా ఆదేశాలు జారీ చేశారన్నారు. పినపాక నియోజకవర్గంలో వాగులు అధికంగా ఉన్నందున, ప్రజలను అప్రమత్తం చేసేందుకు కలెక్టర్లు, జిల్లా అధికారులందరితో మాట్లాడి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అధికారులతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ప్రజలకు అవగాహన కల్పించి, వారు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి అన్నారు.

## అంబేద్కర్ సెంటర్లో బస్టాండ్ స్థల పరిశీలన




**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు మండలం అంబేద్కర్ సెంటర్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్టాండ్ ఏర్పాటు చేయాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు బుధవారం మణుగూరు మున్సిపల్ కమీషనర్ ప్రసాద్ తో కలిసి బస్టాండ్ స్థల పరిశీలన చేశారు. అనంతరం సాధారణ ప్రజలతో మమేకమై వారితో కూర్చుని టీ తాగారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావుని పరామర్శించిన తాటి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మాజీ మంత్రి, ఎంఎల్ఏ తన్నీరు హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు మంగళవారం మృతి చెందారు. కాగ బుధవారం హరీష్‌రావుని హైదరాబాద్‌లోని కోకాపేటలో వారి నివాసంలో బూర్గంపాడు, అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ ఛైర్మన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాటి వెంకటేశ్వర్లు కలిసి పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/ బోనకల్ :** ముంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల వలన పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ముంథా తుఫాన్ ప్రభావంతో బోనకల్ మండలంలో గత రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మండలంలో పత్తి, వరి, మిర్చి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మండల రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## నిలిచిన నీటి తొలగింపు




**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు ఠాగూర్ విద్యాలయం సమీపంలో కురిసిన అకాల వర్షానికి ఆ ప్రాంతం జమలయం అయిన విషయం తెలుసుకున్న మున్సిపాల్ కమీషనర్ గురులింగం వెంటనే స్పందించిన శానిటేషన్ అధికారి వీరన్నను అక్కడ పంపించి ఆ ప్రాంతంలో నీరు నిల్వ లేకుండా జేసిబిల సహాయంతో నీటిని పూర్తిగా బయటకు తొలగించి సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రాంత ప్రజలు సమస్య తెలుసుకున్న వెంటనే స్పందించిన మున్సిపాల్ కమీషనర్ గురులింగంకు, మున్సిపాల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# నీటమునిగిన రోడ్ల వద్ద పటిష్ట చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు అనేక రోడ్లు నీటమునుగుతున్నాయని అలాంటి రోడ్ల వద్ద అధికారులు పటిష్ట బందోస్తు ఏర్పాటుచేసి ప్రజలను ఎట్టి పరిస్థితుల్లోను రోడ్డు దాటనీయవద్దని జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం మండల పరిదిలోని తుమ్మలపల్లి వద్ద పగిడేరు వరప్రవాహాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజలు నీటమునిగిన రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలందు జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. మోంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో భారీనుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని లోతట్టు బ్రిడ్జిలు వద్ద ఇరువైపులా బారికేడ్లు, ట్రాక్టర్లను అడ్డుపెట్టి బ్రిడ్జిలను మూసివేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటు ఎప్పటికప్పుడు వరదప్రవాహాన్ని అంచనావేస్తు అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ప్రజలకు ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లైతే టోల్ ఫ్రీనెంబర్ 1077, వాట్సప్ సెల్ నెంబర్ 9063211298 లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భారీవర్షాలకు చెరువులు, వాగులు అలుగుపారే అవశాకం ఉందని ప్రజలు స్వీయజాగ్రత్తలు పాటించాలని అన్నారు. అవసరముంటే తప్ప ప్రజలు బయటకు రావద్దని స్పష్టం చేశారు. తహశీల్దార్లు, ఎంపిడీఓలు, పోలీసులు ఎప్పటికప్పుడు పరిస్థితులపై చర్యలు తీసుకునేందుకు సిద్దంగా ఉండాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, కొణిజర్ల తహశీల్దార్ అరుణకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైరా మండలంలో మొంథా తుఫాన్ ప్రభావం

**-నేలకొరిగిన వరి పంట -ఆందోళనలో అన్నదాతలు**



**ప్రజాపక్షం/వైరాః** వైరా మండలంలో బుధవారం ఎడతెరిపి లేకుండా గాలులతో వచ్చిన మొంథా తుఫాన్ వలన చేతికి వస్తున్న తరుణంలో వరి పంట నేలకు కలిసిపోయి రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆరుగాలం పంటలు సాగు చేసి ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నదాతకు ప్రకృతి వైఫల్యం ఏదో ఒక రూపంలో రావడంతో అన్నదాతలు ఆగమాగం అవుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావం అన్నదాతలపై మరోసారి ఇరుచుక పడిందని చెప్పవచ్చును. చేతికి వచ్చిన వరి పంట కోతకు రానున్న సమయంలో ఈదురు గాలులకు వరి పొలాలు పూర్తిగా నేలకొరిగి పోయాయి. దీంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో పంట పొలాలకు వెళ్లిన రైతు పడిన వరి పొలాన్ని చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికే పత్తి రైతులు బోరున విలపిస్తుంటే మరోపక్క వరి పంట కూడా చేతికి రాకుండా పోతుందనే బాధ రైతులు ఆవేదనకు గురిచేస్తుంది. తెచ్చిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. కౌలు రైతులు పూర్తిగా కోల్కోలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పవచ్చును.

**వరి పంట నేలపాలైంది: రైతు ప్రసాద్**



వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన వాసంశెట్టి ప్రసాద్ అనే రైతు సుమారు 35 ఎకరాల వరి పంట సాగు చేశాడు. మొంథా తుఫాన్ ప్రభావంతో గింజ పోసుకునే సమయంలో పూర్తిగా వరి పొలం గాలికి క్రిందపడిపోయింది. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో అప్పులు ఎలా తీరతాయి అర్థం కావడం లేదని రైతులు ప్రసాద్ ఆవేదన చెందుతున్నాడు.

# మొంథా తుఫాన్‌తో పంటలకు తీవ్ర నష్టం

**-పలు చెరువులకు అలుగులు**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో పలు చెరువులకు అలుగులు పారాయి. బుగ్గవాగు వరద ఉధృతితో పాపటపల్లి విఆర్ బంజర గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో రఘునాథపాలెం మండల వ్యాప్తంగా వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న వరి పంటలో వర్షంతో పాటు ఈదురు గాలులు రావడంతో వరి మొత్తం నేలవాలింది. పత్తికి కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. పలు చెరువులు అలుగులు పారాయి. బుగ్గవాగు ఉధృతితో రహదారిపై వరద నీరు చేరడంతో పాపటపల్లి విఆర్ బంజర గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. పలు పాఠశాలల్లో వర్షపు నీరు నిలిచింది. గరిడేపల్లి విఆర్ బంజర గ్రామాల మధ్య ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలోకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

# కమ్మ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్స్ మీట్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కమ్మ మహాజన సంఘం ఖమ్మం ఆధ్వర్యంలో డాక్టర్స్ మీట్ నిర్వహించారు. ఖమ్మం నగరంలోని వైద్యులందరిని ఒకే వేదికపైకి తీసుకు వచ్చి పరిచయ కార్యక్రమం నిర్వహించడంతో పాటు వారి అనుభవాలను పంచుకోవడం భవిష్యత్తు సేవా కార్యక్రమాలకు దిశా నిర్దేశం కోసం డాక్టర్స్ మీట్ నిర్వహించినట్లు కమ్మ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లు రఘుసత్యనారాయణ, చావా రాము లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సంఘం ఆధ్వర్యంలో వైద్యుల సహకారంతో వైద్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించారు. వైద్యులంతా ఐక్యతగా ఉంటూ యువతకు సలహాలు, సూచనలు అందించడం సమాజానికి చేరువయ్యే ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. సామాజిక సేవ ద్వారా సంఘానికి గుర్తింపు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని వైద్యులు తెలిపారు. ఐఎన్ఏ కార్యదర్శి డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు డాక్టర్ కంబంపాటి నారాయణరావు, డాక్టర్ బాగం కిషన్‌రావు, సీనియర్ వైద్యులు అజయ్‌కుమార్, కన్నెకంటి శివరామకృష్ణ, గురునాథరావు, మిక్కిలినేని విజయ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మేదరమెట్ల స్వరూపరాణి, మోత్కూరి సత్యనారాయణ, నల్లమల ఆనంద్, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, కోలేటి నవీన్, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్ధిఉత్సవాల ముగింపు సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**
**-సాంబాయిగూడెంలో 30 కుటుంబాలు సిపిఐలో చేరిక**






**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు మండలం సాంబయ్య గూడెం గ్రామానికి చెందిన సుమారు 30 కుటుంబాలు బుధవారం సిపిఐ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా సమక్షంలో సిపిఐ పార్టీలో చేరారు. వీరికి ఎర్ర జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాంబయ్యగూడెం గ్రామంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పులిగల రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ భాష ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిన చరిత్ర ఉందని భూస్వాములకు వ్యతిరేకంగా, పీడిత ప్రజానీకానికి అండగా ఉంటూ, కార్మిక కర్షక , పేద, బడుగు బలహీన వర్గాలకు అనునిత్యం వారికి అండగా ఉంటూ వారి సమస్యల సాధన కోసం పనిచేస్తూందని, భూస్వామ్యులను ఎదిరించి దొరల గడీలను వద్దలు కొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధిలో సిపిఐ పాత్ర మరువలేనిదని, సిపిఐ అధికారంలో ఉన్న లేకున్నా ఈ ప్రాంత పేద ప్రజల కోసం అను నిత్యం పోరాటాలు కొనసాగించిందన్నారు. పినపాక నియోజకవర్గం లో గల్లీ నుంచి ఢిల్లీ వరకు అనేక పదవులు అనుభవించిన చరిత్ర సిపిఐ పార్టీదని, సిపిఐ పార్టీలలో ఎమ్మెల్యేగా ఎంపీలుగా గెలిచి ఈ ప్రాంతంలో నియోజకవర్గ అభివృద్ధిలో సిపిఐ ఎనలేని కృషి చేశారని వారి సేవలు మరువలేనివి అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల కోసం, నిత్యం పనిచేసే కమ్యూనిస్టు పార్టీని ప్రజలు ఆకర్షితులై నేడు సామాన్యగూడంలో 30 కుటుంబాలు చేరిక జరిగిందని ఇది శుభ పరిణామం అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పనిచేసే ముందుకు సాగాలన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం లో జరిగే సిపిఐ శతజయంతి ముగింపు వేడుకల్లో ప్రతి ఒక్కరు కదం తొక్కాలని, 5 లక్షల మంది జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని దీనికోసం సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం హాజరై మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ అనునిత్యం పేద ప్రజల సమస్యల పట్ల నిత్యం పనిచేసే 100 సంవత్సరాలు భారతావనిలో శత వసంతాల ముగింపు వేడుకలు ఖమ్మం నగరంలో డిసెంబర్ 26న 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ కన్నీ విని ఎరుగని రీతిలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నామని, దీనికి 45 దేశాల నుండి ప్రతినిధులు జాతీయ రాష్ట్ర నాయకత్వం మొత్తం భారీ బహిరంగ సభలో పాల్గొన్నారని కావున ఈ శత జయంతి ముగింపు వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రద చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి,మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, సీపీఐ మణుగూరు మండల పట్టణ కార్యదర్శి లు జక్కుల రాజబాబు, దుర్గాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, సొందే కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కామిశెట్టి రామారావు, ఎస్‌కె. సర్వర్, మంగి వీరయ్య, తోట రమేష్, పాయం లక్ష్మయ్య, కణితి సత్యనారాయణ, నోముల రవి, భీమరాజు కృష్ణ, యాకూబ్ పాషా, ఎడారి కృష్ణ, మామిడిపల్లి శీను, రాజబోయిన సీను, యనమల సుధాకర్, రంజిత్, చీడం ఉషారాణి, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు. ముందుగా చనిపోయినటువంటి వారికి కరెండు నిమిషాలు సంతాపం పాటించారు.

# మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

**- ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా మండలంలో ఐదు దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు దాన్యాన్ని కొనుగోలు చేయనున్నామని సొసైటీ అధ్యక్షులు, డిసిఎంఎస్ మాజీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సహకారం సంఘం కార్యాలయంలో దాన్యం కొనుగోలు నిర్వాహకులు, వ్యవసాయ అధికారుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సంధర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల పరిధి రెడ్డిగూడెం, కారెగట్టు, సోములగూడెం, నాగారం, పాల్వంచ మున్సిపాలిటి పరిధి పేటచెరువులో దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏ గ్రేడ్ దాన్యానికి రూ.2,359/లు, సాధారణ రకం దాన్యానికి 2,369/లుగా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినదన్నారు. సన్న రకం దాన్యానికి కింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తుందని తెలిపారు. కావునా రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**- నూతన సిఈఓ...**

పాల్వంచ సొసైటీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన లక్ష్మీనారాయణ బూర్గంపాడుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన కార్యదర్శిగా బత్తిన వెంకట ప్రసాద్ బుధవారం బాధ్యతలను తీసుకొన్నారు. ఈ సంధర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామమోహనరావు, సామా జనార్ధన రెడ్డి, జరబన సీతారాం బాబు, భూక్యా కిషన్, ఎర్రంశెట్టి మధుసూధన్‌రావు, కార్యదర్శులు బివి ప్రసాద్, జి. లక్ష్మీ నారాయణ, ఏఈఓ అణురిక, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావిత పంటల పరిశీలన



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని పోచారం, హట్యతండా, పెరికసింగారం, జక్కేపల్లి గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంలో నీటిని వెంటనే తీసివేయాలని, గింజ తయారై కోతకు సిద్ధంగా ఉన్న పొలాలు నీట మునిగినట్లయితే, లీటరు నీటికి 50 గ్రాములు చొప్పున ఉప్పును కలిపి ఆ ద్రావణాన్ని పిచికారి చేసినట్లయితే గింజలు మొలకెత్తకుండా ఉంటాయని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**ఏవో రామడుగు వాణిని అభినందిస్తున్న కూసుమంచి మండల రైతులు...**

మండలంలో బుధవారం నాడు ఏకధాటిగా కురుస్తున్న వర్షంను సైతం లెక్కచేయకుండా మండలంలోని పోచారం, జక్కేపల్లి, పెరికిసింగారం, అత్యాతండ గ్రామాల్లో రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మండల వ్యవసాయ శాఖ మహిళా అధికారి రామడుగు వాణిని మండలంలోని పలువురు రైతులు ఆమె సేవలను అభినందించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం నుండి నాట్లు వేసే మొదలు మొక్కలు విత్తనాలు పెట్టే మొదలు నుండి పంటలు పూర్తయ్యేంతవరకు మహిళా అయినప్పటికీ అనేక మార్లు అనేక సమయాలలో రైతుల కోసం ఎంత సమయమైనా హెచ్చించి ఓపికతో పంట పొలాలను పరిశీలించి వారికి తగిన సలహాలు సూచనలు ఇవ్వడం ఎంతో ఓపికతో రైతులకు సమాచారం అందించి వారిని మెప్పిస్తుండటంతో పలువురు రైతులు ఆమెను సేవలను అభినందిస్తున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/కామేపల్లి :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుఫాను ప్రభావంతో బుధవారం తెల్లవారుజాము నుండి కురిసిన కుండపోత వర్షానికి కామేపల్లి మండలంలో పాత లింగాల చెరువు, బండిపాడు బుగ్గవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు నీటితో నిండి పరవళ్లు తొక్కడంతో ఖమ్మం జిల్లా కొత్త లింగాల, మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ ప్రధాన రహదారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని చెరువుల కుంటలు అలుగులు పడి ప్రవహిస్తున్నాయి. వరద పరిస్థితి ఖమ్మం జెడ్‌పి సీఈవో దీక్ష రైనా, కారేపల్లి సర్కిల్ సిఐ లూనావత్ సాగర్, కామేపల్లి తహసీల్దార్ సిహెచ్ సుధాకర్, ఎంపీడీవో రవీందర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ విజయ భాస్కర్, పంచాయితీ కార్యదర్శి ఎండి ఫజల్, తదితరులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, మండలాలు గ్రామాల్లో వర్షాలు తీవ్రంగా కురుస్తూ ఉండటంతో ప్రజలు భద్రతపై తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, వాగులు నిండిపోవడంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరుకాలంగా పండించిన మొక్కజొన్న పంట రైతులందరూ రోడ్లపైనే ఆరబెట్టుకున్నారని, తక్షణమే వ్యవసాయ అధికారులు స్పందించి టార్పల్ పట్టాలను ఎటువంటి షరతులు లేకుండా రైతులకు ఆరబెట్టుకునేందుకు మంజూరు చేయాలని కోరారు. పత్తి మొక్కజొన్న వరి తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్నాయని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** మొంథా తుఫాన్ ప్రభావం రీత్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని అన్నారు. వర్షం అధికంగా ఉండటంతో చెరువులు, వాగులు, ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, గనుక వాటి దగ్గర్లోకి వెళ్లడం, చేపల వేటకు వెళ్లడం లాంటి పనులు చేయవద్దన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ నాయకత్వం మొత్తం ఆయా గ్రామాలలో పరిస్థితులు అధికారులకు తెలియజేస్తూ, అత్యవసర పరిస్థితులలో సహాయక చర్యలలో పాల్గొనాలని, లోతట్టు ప్రాంతాలు, లేదా కూలిపోయే దశలో ఉన్న ఇండ్లలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు.

## పాలేరు రిజర్వాయర్ 24 గేట్లు ఎత్తిన అధికారులు



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని పాలేరు రిజర్వాయర్ 24 గేట్లను ఎత్తిన ఎన్ఎస్పి అధికారులు. గత రెండు రోజుల నుండి మండలంలోని పాలేరు రిజర్వాయర్ పరిసర జిల్లాలలో(ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్)కురుస్తున్న వర్షాలకు పాలేరు రిజర్వాయర్‌కు వస్తున్న నీటి ప్రవాహం పాలేరు రిజర్వాయర్‌కు చేరుకోవడంతో ఇప్పటికే రిజర్వాయర్ 22.25 అడుగుల నీటితో నిండుకొని ఉండటంతో బుధవారం నాడు అధికారులు రిజర్వాయర్ 24 గేట్లను ఎత్తారు. పాలేరు రిజర్వాయర్‌కు వస్తున్న నీటి ఇన్ ఫ్లో 524 క్యూసెక్కులు కాగా గేట్ల ద్వారా వదులుతున్న నీరు 4102క్యూసెక్కులుగా ఎన్ఎస్పి అధికారులు తెలిపారు.

## మొంథా తుఫాన్‌లో దెబ్బతిన్న పంటలు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల వ్యాప్తంగా మొంథా తుఫాన్‌తో పంటలు దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికి వచ్చిన పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. పలు చోట్ల వరి నేల వాలి నీటి మునిగాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పంట దెబ్బతిన్న రైతులకు అండగా నిలవాలని, అధికారులతో సర్వే చేసి పంట నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

## భారీ చింత చెట్టు నేలమట్టం



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల పరిధిలో పోలంపల్లి గ్రామ పంచాయితీలోని పోలంపల్లి గ్రామంలో మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ చింత చెట్టు వేర్లతో సహా పడిపోయింది. భారీ చింత చెట్టు నెలమట్టం కావడంతో విద్యుత్ స్తంభాలు సైతం విరిగి పడిపోవడం జరిగింది. కాగా మండలంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలిగింది.

# ఖమ్మం జిల్లాలో భారీ వర్షం

-నేల వాలిన వరి
-వాగులో కొట్టుకుపోయిన లారీ





**ప్రజాపక్షం/ ఖమ్మం :** మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు జిల్లాలో ఎడతెగని వర్షం కురిసింది. దాదాపు అన్ని మండలాల్లోనూ వర్షం కురువగా అత్యధికంగా కామేపల్లి మండలంలో తొమ్మిదిన్నర సెంటి మీటర్ల వర్షం కురిసింది. ఎగువన వరంగల్, మహబూబాబాద్‌జిల్లాలో వర్షాలు పడుతుండడంతో మున్నేరుకు వరద ఉధృతి పెరిగింది. ఆరున్నర గంటల సమయానికి 20 అడుగులకు చేరుకుంది. జిల్లాలోని పలు చోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. బుగ్గవాగు పొంగడంతో ఖమ్మం, డోర్నకల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తుఫాన్ కారణంగా దాదాపు మూడు గంటల సేపు షిర్డి ఎక్స్‌ప్రెస్‌ను మధిరలో నిలిపివేశారు. పాలేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరడంతో 24 గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద వరద ఉధృతికి లారీ కొట్టుకుపోయింది. లారీతో పాటు డ్రైవర్ కూడా గల్లంతయ్యాడు. ఖమ్మం నగరం సహా పలు ప్రాంతాల్లో వర్షపు నీరు పల్లపు ప్రాంతాలను ముంచింది. ఖమ్మం బైపాస్ రోడ్డులో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోతకు వచ్చే దశలో తుఫాన్ రావడంతో వరి పంట మొత్తం నేలకొరిగింది. వరి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికే మెట్ట పంటలను మింగిన అతివృష్టి ఇప్పుడు వరి రైతులను కూడా ముంచింది. రాగల మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేసింది.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మొంథా తుఫాన్ ప్రభావంతో ఖమ్మంరూరల్ మండలం వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజామునుంచి వర్షం దంచికొట్టింది. ఈ నేపథ్యంలో రైతుల వేసుకున్న పంటలు నీట మునిగాయి. అలాగే ఆకేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తీర్థాల వద్ద బ్రిడ్జిపై నుంచి నీరు వెలుతుంది. దీంతో తీర్థాలగోళ్లపాడు వైపు రాకపోకలు నిలిచిపోయాయి. మున్నేటి లోతట్టు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలను ఎలర్ట్ చేయాలని ఆదేశించారు. గుర్రాలపాడు, ఆరెంపులలో పంట నష్టాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం సతీష్ పరిశీలించారు. సుమారు 130ఎకరాలు నెలకొరిగినట్టు గుర్తించారు. మున్నేరు ప్రవాహం అంతకంతకు పెరుగుతుండటంతో కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి సూచనలతో ఏదులాపురంమున్సిపాలిటీ సిబ్బంది మైక్ ద్వారా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఏదులాపురం ఈదుల చెరువు అలుగు ఉధృతంగా



ప్రవహిస్తుండటంతో శ్రీరామ్‌నగర్ ప్రధాన దారి నుంచి నీరు ప్రవహించింది. విషయం తెలుసుకున్న సిపిఐ నాయకులు దండి రంగారావు పరిశీలించి, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమాలలో ఆర్డీఓ నర్సింహారావు, తహశీల్దార్ రాంప్రసాద్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షం.. నీట మునిగిన పంట పొలాలు

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మొంథా తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవరారం రాత్రి నుండి బుధవారం మధ్యాహ్నం వరకు మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రజలు ఎవరూ కూడా బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. మండలంలో అన్ని రకాల పంటపొలాలు నీట మునిగాయి. పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలు మండల వ్యాప్తంగా గత కొన్నిరోజులు నుండి కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్నాయి. తుఫాన్ కారణంగా ఈ రెండు రోజులు కురుస్తున్న వర్షాలకు కొద్దిపాటి పంట కూడా నీట మునిగిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఇప్పటివరకు ఆశాజనకంగా ఉన్న వరి పంట కూడా వర్షాలకు నీటమునిగిపోయాయ. దీంతో మండలంలోని రైతులను కోలకోలేని దెబ్బతీసిందని రైతులు వాపోతున్నారు. తీవ్ర తుఫాన్ ప్రభావానికి దెబ్బతిన్న పంటలకు



నష్టపరిహారం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మండలంలో అతిపెద్ద నీటి వనరు అయిన కట్టలేరు నది నిండుకుండలా ప్రవహిస్తుంది. రెవెన్యూ సిబ్బంది బుధవారం గ్రామాల్లో పర్యటించి వర్ష పరిస్థితులను పరిశీలించారు.

## రైతును ముంచిన మొంథా తుఫాన్

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మొంథా తుఫాన్ రైతును ముంచింది. ఆరుగాలం కష్టించిన రైతును ప్రకృతి పగబట్టడం, కన్నీళ్లను తుడుచుకొని మరల ఆ ప్రకృతమ్మ ఒడిలో సేద తీరడం ప్రతిసారి రైతుకు అలవాటైపోయింది. ఈసారి కూడా సేమ్ సీన్ రిపీట్ అయింది. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అంతా సర్దుకునే లోపే వరుణదేవుడు రైతన్నల ఆశలపై నీళ్లు కుమ్మరించాడు. మంగళవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జన జీవనం స్తంబించటమే కాకుండా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. అకాల వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ధాన్యపు కంకులతో కళ, కళలాడిన వరిచేలు నేలకొరిగి వెల, వెల బోతున్నాయి. వరి చేల చుట్టూ నీరు చేరి ధాన్యం కంకులు నీళ్లలో



తేలియాడుతుంటే రైతన్నల ఆశలు ఆవిరైపోయాయి. కొందరు రైతులు రెండు రోజులు ముందుగా వరి కోతలు ప్రారంభించి ధాన్యాన్ని ఆరబోయటంతో, వర్షానికి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం సైతం తడిసి ముద్దైంది. చేతికి వచ్చిన పంట తుఫాన్ ప్రభావంతో నీట మునగటంతో అన్నదాతలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క వర్షం తో పాటు చల్లటి ఈదురు గాలులు వీస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. మొంథా తుఫాన్ ప్రభావం సత్తుపల్లి మండలంలోని రైతన్నలపై గట్టిగానే చూపించినట్లు పరిస్థితులను బట్టి తెలుస్తుంది.

## జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లకు రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ బుధవారం పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల కారణంగా రహదారులపై నీరు నిల్వ ఉండటం, వాగులు, కాలువలు,కల్వర్టుల వద్ద నీటి ప్రవాహం పెరగడం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రవహిస్తున్న వాగులు, కల్వర్టుల వద్ద బస్సులను నడపవద్దని అక్కడ ఉన్న పోలీస్, రెవెన్యూ అధికారుల సూచనల మేరకు వాహనాలను నడపాలని సూచించారు. డ్రైవర్లు ఎవరు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవద్దని హెచ్చరించారు. ప్రయాణికుల భద్రతే ప్రధానమన్నారు.

## వాగులో కొట్టుకుపోయిన డిసిఎం

### -డ్రైవర్ గల్లంతు డ్రయివర్‌కోసం గాలిస్తున్న ఎన్‌డిఎఫ్ఆర్ బృందాలు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఓ డిసిఎం వాహనం వరదలో కొట్టుకుపోయి డ్రైవర్ గల్లంతైన సంఘటన మండలపరిదిలోని అంజనాపురం నిమ్మవాగువద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మోతీనగర్ కాలనీకి చెందిన ఆరేపల్లి మురళి (32) మూడు రోజుల క్రితం అదే మండలం నారావారి గూడెంకు చెందిన మునుగొండ వెంకటముత్యం అనే వ్యక్తికి చెందిన డీసిఎం వ్యాన్‌కు యాక్టింగ్ డ్రయివర్‌గా చేరి సుజాతనగర్‌లో పత్తిలోడు నిమిత్తం వచ్చినట్లు సమాచారం. బుధవారం తుఫానువల్ల భారీ వర్షం కురిసి అంజనాపురం నిమ్మవాగు బ్రిడ్జిపైనుంచి పొంగి ప్రవహిస్తుండగా డ్రయివర్ మురళి కొణిజర్ల వైపునుంచి డీసిఎం వాహనాన్ని వాగులోనుంచి ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నించాడు. స్థానికులు ఏన్కూరు పోలీసులు వారిస్తున్న వినకుండా వాహనాన్ని ముందుకు తీసుకుపోగా వరదుధృతికి డీసిఎం వాహనం వాగులో కొట్టుకుపోయి డ్రయివర్ మురళి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న కొణిజర్ల జి సూరజ్ నేతృత్వంలో ఎన్‌డీఎఫ్ఆర్ బృందాలను రప్పించి వాగువరదలో వెదికారు. సాయంత్రం వరకు కూడా డీసిఎం వాహనం, మురళి జాడ తెలియరాలేదు. ఖమ్మం సిపి సునీల్‌దత్ డీసిఎం వాహనం, డ్రయివర్ గురించి ఆరా తీశారు.

## ధంసలాపురం వాసి చిరంజీవికి డాక్టరేట్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ధంసలాపురం కొత్త కాలనీకి చెందిన వంగూరి చిరంజీవి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. స్కెలబుల్ ఏఐ డిజైనింగ్ ఎఫిసియెంట్ మోడల్స్ ఫర్ బిగ్ డేటా ఆనలిటిక్స్ రిలేవంట్ ఫర్ ది ఎరా ఆఫ్ ఎవర్ గ్రోయింగ్ డేటా సెట్స్ అనే అంశంపై డాక్టర్ విక్రమ్ సింగ్ రాథోర్ పర్యవేక్షణలో చిరంజీవి సమర్పించిన పరిశోధన పత్రంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన జెఎస్ విశ్వ విద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న చిరంజీవి డాక్టరేట్ సాధించడంతో కాలనీ వాసులతో పాటు కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, ఆళ్ల నిరీషాఅంజిరెడ్డి లు తదితరులు అభినందించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ బుధవారం తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువులు, కుంటల్లో నీరు చేరాయన్నారు. వాగులు, వంకలు దాటి రహదారులపై ప్రయాణాలు చేయవద్దని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావద్దన్నారు. వర్షాలు కురిసేటప్పుడు చెట్ల క్రింద ఉండవద్దన్నారు. అత్యవసరమైతే డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు.

## ప్రమాదకర గుంతను పూడ్చండి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు నుంచి చంద్రుపట్ల వెళ్ళే రహదారిలో సెంచరీ స్కూల్ ఎదురుగా ఆర్ అండ్ బి రహదారిపై భారీ వర్షాలు కారణంగా ప్రమాదకర గుంతగా ఏర్పడి రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ప్రయాణికులు, వాహనదారులు, విద్యార్థులు, తెలుపుతున్నారు. ఈ రహదారిపై చంద్రుపట్ల, రఘునాథగూడెం, రఘునాథ బంజర్ గ్రామాల ప్రజలు కల్లూరు మండల కేంద్రానికి నిత్యవసరాలు, కార్యాలయాలలో అవసరాల కొరకు విద్యార్థులు పాఠశాలకు, కళాశాలకు, వస్తూ పోతూ ఉంటారు. దీనివలన రాకపోకల సమయంలో ఒకేసారి గుంతగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని దీనిని వెంటనే పూడ్పించాలని ప్రయాణికులు, వాహనదారులు ఆయా గ్రామస్తులు రోడ్లు భవనాల శాఖ అధికారిని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బి జేఈఈని వివరణ కూడా వర్షాలు తగ్గగానే మరమ్మత్తులు చేస్తామని తెలిపారు.

## మున్సిపాలిటీలో నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు నూతన మున్సిపాలిటీలో ఆన్లైన్లో వెబ్‌సైట్లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కల్లూరు మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక అధికారి ఇటికల భాస్కర్ తెలిపారు. 75 గజాలలో పుస్తకంలో రెండంతస్తుల నిర్మించే గృహ భవనాలకు ఒక్క రూపాయితో ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్ విధానంలో తక్షణమే అనుమతి వస్తుందని, ఎలాంటి ఇంజనీరింగ్ ప్రణాళిక అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. పట్టణంలో నిర్మించే పక్కా భవనాలకు తప్పనిసరిగా అనుమతులు తప్పనిసరి అని, పూర్తి వివరాలకు మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ ప్రణాళిక అధికారిని తప్పనిసరిగా సంప్రదించి అనుమతులు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : కూనంనేని

- ముందస్తు జాగ్రత్త చర్యలతో నష్టాన్ని నివారించండి
- సహాయక చర్యల్లో సిపిఐ శ్రేణులు బాగస్వాములు కావాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మొంథా తుపాను ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాం గం అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబ శివరావు అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్, పంచాయితీ రాజ్, రోడ్డు, భవనాలశాఖ, వ్యవసాయశాఖ, ప్రజారోగ్య, విద్యుత్‌శాఖతో పాటు పోలీస్ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు పడితే తీవ్రమైన నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, ఆ నష్టాన్ని నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజలకు తగిన సూచనలు చేయాలని, ముంగు గురయ్యే ఇబ్బందులు పడే ప్రజలను ఆదుకునేందుకు సిపిఐ శ్రేణులు సిద్దంగా ఉండి సహాయక చర్యల్లో ముమ్మరంగా పాల్గొనాలని సూచించారు. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# తుంపర జల్లులు.. ఈదురు గాలులు

- పంటలకు తీవ్ర నష్టం
- బొగ్గు ఉత్పత్తికి ఆటంకం





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో స్పష్టంగా కనిపిస్తోంది. తీవ్ర వాయిగుండంగా మారిన తుపాను బలమైన ఈదురు గాలులతో భీభత్సాన్ని సృష్టిస్తూ దిశను మార్చుకుని భద్రాచలానికి సుమారు 50 కి.మీ దూరంలో కేంద్రీ కృతమైంది. దీని ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఖమ్మం, ములుగు జిల్లాలో వానలు కురుస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం నుండి సన్నటి తుంపర్లు పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఒక్కసారిగా ఆకాశానికి చిల్లు పడినట్లుగా వాన కురుస్తోంది. గోదావరి తీర ప్రాంతం కావడంతో ఈదురు గాలుల ప్రభావం కనిపిస్తోంది. రాగల 48 గం.లలో సైతం ఇదే తరహా పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుండి బయటకు రావద్దంటూ కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచన చేశారు. గోదావరి తీర ప్రాంతాలు, వాగులు, వంకలు, నదులు వద్దకు వెళ్లి సెల్ఫీల కోసం ఆరాటపడవద్దని, వాగులు, వంకలు దాటే క్రమంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వర్ష ప్రభావంతో జిల్లాలో బుధవారం విద్యాలయాలకు సెలువులు ప్రకటించారు. వీటిని మరో ఒక రెండు రోజుల పాటు పొడిగించే అవకాశముంది. తుపాను ప్రభావంతో వాతావరణం పూర్తి తేమగా మారడంతో పిల్లలు, వృద్ధులు జలుబు, జ్వరాలు భారిన పడుతున్నారు. మొంథా తుపాను ప్రభావం వ్యవసాయ శాఖపై భారీగా పడనుంది. ఇప్పటికే అతివృష్టి కారణంగా భారీగా పంటల దిగుబడులు తగ్గాయి. జిల్లాలోని పలు చోట్ల చేతికొచ్చిన వరి పంటలు నేలకొరిగాయి, కొన్ని ప్రాంతాల్లో వరిచేలల్లోకి వర్షపునీరు చేరింది. పత్తితీతలకు సైతం తీవ్ర ఆటంకం ఏర్పడనుంది. ఇప్పటికే కోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. తుపాను ప్రభావంతో సంగరేణి ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. గడిచిన 48 గం. నుండి బొగ్గుగని ఏరియాల్లో వర్షం పడుతోంది.

# పంట నష్టంతో లబోదిబోమంటున్న రైతన్నలు



**ప్రజాపక్షం/పినపాక:** మండల వ్యాప్తంగా ముంథా తుఫాన్..రైతన్నలను కొపం ముంచింది. టీ కొత్తగూడెం, జానంపేట, చింతలబయ్యారం, పాతరెడ్డిపాలెం, గోపాలరావుపేట, సింగిరెడ్డిపల్లి పలు గ్రామాల్లో గత రెండు రోజులుగా మబ్బులతో కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలులకు చాల చోట్ల వరి పంట నేలమట్టమైంది. కొన్ని చోట్ల కోత కోసిన పంట, ధాన్యం నిల్వలు తడిసి ముద్దయ్యాయి. దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. పంట నష్టం తప్పదని వారు భావిస్తున్నారు. పినపాక మండలంలో బుధవారం కూడా ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. సాయంత్రానికి వర్షం తీవ్రత పెరిగింది. చాలా చోట్ల ముఖ్యంగా ఈదురుగాలులతో కూడిన వాన తెరిపివ్వకపోవడంతో వరి పొలాల్లో నీరు చేరుతోంది. అయితే మరో రెండు రోజుల పాటు కూడా తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ హెచ్చరించడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వివిధ మార్గాల్లో పంట సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. కాగా కుప్పలుగా ఉన్న చోట్ల కూడా ధాన్యం మొలకలు వచ్చేస్తాయన్న టెన్షన్ రైతులను వెంటాడుతోంది. అంతంతమాత్రంగానే చేతికందిన పంట ఇంటికి చేరుతుందన్న సమయంలో ప్రస్తుత వాతావరణం వారిని తీవ్రంగా కలవరపెడుతోంది.

**నష్టపరిహారం చెల్లించాలి : ఏ లక్ష్మణ్, రైతు, జానంపేట**

నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. తుఫాన్ కారణంగా ఈదురుగాలులతో వరి పంట పూర్తిగా నేలమట్టమయింది. ఎకరానికి రూ 30వేలు ఖర్చు అయింది. వర్షం కారణంగా వరి పంట నీట మునగడంతో వడ్లు మొలకెత్తుతాయని ఆందోళనలో ఉన్నాను. మా పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకుంటున్నాను.

# అకాల వర్షం.. రైతులకు అపార నష్టం

పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



**ప్రజాపక్షం/ఏన్కూరు :** తుఫాన్ ప్రభావంతో బుధవారం మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో రైతులకు అపారనష్టం కలిగింది. వాగులు వంకలు నిండి పొంగిపొరిలాయి. పలు గ్రామాలు చెరువులు నిండి అలుగులు పారాయి. దీంతో సంబంధిత గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం కలిగింది. ముఖ్యంగా ఏనుకూరు టిఎల్ పేట మధ్యలో టియల్ పేట చెరువు నిండి అలుగు పారడంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. ఏనుకూరు నుండి ఖమ్మం వైపు వెళ్లే రహదారి కావడంతో వాహనదారులు సైతం ఇబ్బందులకు గురి అయ్యారు. దీంతోపాటు రేపల్లెవాడ నాచారం మధ్య వాగు, నాచారం గంగుల నాచారం మధ్య వాగు, ఏనుకూరు నుండి జన్నారం మీదుగా ఖమ్మం వైపు వెళ్లే అంజనాపురం వద్ద వాగు ఉధృతంగా పొంగి పొర్లడంతో రాకపోకలు పూర్తి అంతరాయం కలిగింది. జన్నారం సమీపంలోని అంజనాపురం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం రావడంతో మండలంలో పాఠశాల సైతం పూర్తిగా మూసివేశారు. గ్రామాల్లో జనజీవన స్తంభించిపోయింది. ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో ప్రజలు చలికి వణికిపోయారు. ప్రస్తుతం మండలంలో పత్తి తీతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి పత్తి మొత్తం తడిసి దెబ్బతిని పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పొలాల సైతం కోతకు రావటంతో ఈదురు గాలులకు పూర్తిగా నేలకొరిగాయి. పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిషేదిక మావోయిస్టు పార్టీలో పనిచేసి ఇటీవల లొంగిపోయిన ముగ్గురు సభ్యులకు ప్రభుత్వం నుండి మంజూరైన రూ.9 లక్ష 50 వేల నగదును ఎస్‌పి రోహిత్ రాజ్ వారికి అందజేశారు. ఈ రివార్డులను ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాకు చెందిన రామ్‌సింగ్ కొడే, నరోటి మనీష్ రూ.5 లక్షలు, ఊసూరు బ్లాక్ చెందిన ముచ్చిక సోందాల్ రూ.3.75 లక్షలు, చింతగుప్పకు చెందిన మోడి భీమీ అలియాస్ దేవా రూ.75 వేలు చెక్కుల రూపంలో ఎస్పి బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ నిషేదిక సిపిఐ మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదులను వారి పునరావాసం కోసం అందజేయడం జరిగిందని తెలిపారు. కాలం చెల్లిన సిద్దాంతాలతో స్వార్థ ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ నాయకులు, అమాయకులైన ఆదివాసీలను బలవంతంగా తమ పార్టీలోకి చేర్చుకునివారి చేత చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయించారని తెలిపారు. లొంగిపోయిన సభ్యులకు జిల్లా పోలీసులు అండగా ఉంటారన్నారు.ఇంకా మావోయిస్టు పార్టీలో ఉంటూ అజ్ఞాత జీవితాన్ని సాగిస్తూ ఉన్న వారి లొంగిపోయి జనజీవస్రవంతిలో కలవాలని ఎస్‌పి కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ నరేందర్, ఆర్ఐ ఆపరేషన్స్ రవి పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తవ్వకాలను చేపట్టవద్దు

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి అటవీ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలను చేయవద్దని ఆళ్లపల్లి రేంజర్ ఎన్ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణా చేసినందుకు ముందుగా స్వాధీనం చేసుకున్న 8 ట్రాక్టర్లు, వాటి ట్రాలీలను చట్టపరంగా ప్రక్రియలు పూర్తి అయిన తరువాత విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రతి ట్రాక్టర్‌పై రూ 44,145 చొప్పున, మొత్తం రూ 3,53,160 లను కాంపౌండింగ్ జరిమానా విధించి, చట్ట ప్రకారం వసూలు చేసిన తరువాతే వాహనాలు విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రజలు అక్రమ ఇసుక తవ్వకం లేదా రవాణాలో పాల్గొనవద్దని విజ్ఞప్తి చేయబడుతోందన్నారు. ఉల్లంఘన చేసిన వారి వాహనాలు స్వాధీనం చేయబడతాయని, భారీ జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భవిష్యత్ తరాల ప్రయోజనార్థం వన్యప్రాణి సంరక్షణ, అటవీ వ్యవస్థల పరిరక్షణలో ప్రజల సహకారం అందించాలన్నారు.

# జోరువాన.. నీట మునిగిన పంట పొలాలు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండల వ్యాప్తంగా తుఫాన్ కారణంగా జోరువాన కురిసింది. బుధవారం తెల్లవారు ఝాము నుండి నిరంతరాయంగా వాన కురుస్తుండటంతో మండలంలోని ఎదుళ్లవాగు, లంకల వాగు, రావికంపాడు, బాలియ తండా వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. లంకలవాగు చెక్ డ్యాం పొంగి ప్రవహిస్తుంది. పత్తి చేనుల్లో తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి వానకి తడిసిన నేలపాలయింది. ప్రధానంగా పత్తి రైతులకు ఈ వాన వల్ల నష్టం అధికంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. మిరప చేనుల్లో సైతం వానకి నీరు చేరడంతో రైతులు వాటిని బయటకు పంపే పనిలో నిమగ్నమైన్నారు. తుఫాన్ వల్ల మండల రైతులకు నష్టం అధికంగా పోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

# మానవత్వం చాటిన మెడికల్ ఆఫీసర్



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి ప్రభుత్వ హాస్పిటల్‌కు చెందిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి మానవీయతను చాటారు. వివరాల్లోకి వస్తే ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రోడ్డుపై టీవీఎస్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు వస్తున్న క్రమంలో తప్పింబోయి కిందపడగా అదే సమయంలో అటుగా వస్తున్న డాక్టర్ సాయి ప్రమాద ఘటనను చూసి వెంటనే ప్రమాద స్థలికి చేరుకొని రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రుల్ని లేని నిల్పోబెట్టి అతని వంటిపై గాయాలను పరిశీలించి, నీకు ఎటువంటి ప్రమాదం లేదు ధైర్యంగా ఉండవని మానసిక స్థైర్యాన్ని అందించారు. ఈ లోపుగా పరిసర ప్రాంతాల నుండి అనేక మంది రోడ్డు ప్రమాద స్థలానికి చేరుకొని బాధితున్ని డాక్టర్ సలహా మేరకు కూసుమంచిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకు పంపించారు. ఈసందర్భంగా కూసుమంచి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిని పలువురు అభినందించారు.

# పోడుభూముల జోలికొస్తే సహించేది లేదు



**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం:** ఏళ్ల తరబడి సాగులో ఉన్న పోడుభూముల జోలికి వస్తే సహించేది లేదని సిపియం జిల్లా కమిటి సభ్యులు మర్మం చంద్రయ్య హెచ్చరించారు.బుధవారం మండల పరిధిలోని నందులచెలక గ్రామంలో శాఖ జనరల్‌బాడి సమావేశం జరిగింది.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గత40ఏళ్లుగా రైతులు పోడుభూమల్లో సాగు చేసుకుంటున్న రైతులపై ఫారెస్టు అధికారులు చేస్తున్నదాడులను ఆయన ఖండించారు. రైతులపై అన్యాయంగా బెదిరింపులకు పాల్పడుతూ వారిపై పోలీసులు కేసులు పెట్టడం సరైన పద్ధతికాదని ఫారెస్టుఅధికారులు పద్దతి మార్చుకోని వారిపై దాడులు ఆపాలని హెచ్చరించారు.అటవి హక్కులచట్టం ప్రకారం సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలిని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సోయంకృష్ణ, సోయంచిట్టిబాబు,ముద్దరాజు,వర్సా సీతమ్మ, తెల్లం తిరుపతి రావు,బాపనయ్య,నాగేశ్వరరావు,వజ్రమ్మ,తదితరులు పాల్గోన్నారు.

# న్యాయ వ్యవస్థ పరిరక్షణకు హైదరాబాద్‌లో ర్యాలీ

**-రాజ్యాంగాన్ని గౌరవించని వారు దేశ ద్రోహులే**
**-మీడియా సమావేశంలో మంద కృష్ణమాదిగ**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారతదేశంలో న్యాయ వ్యవస్థ రాజ్యాంగ పరిరక్షణ కొరకు నవంబర్ ఒకటిన దళితులచే హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ తెలిపారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులపై ఇప్పటికీ వివక్ష, అంటరానితనం, దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. దేశంలో అత్యున్నత వ్యవస్థ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ దళితుడైన గవాయ్ మీదనే బూటుతో దాడి జరిగిందని ఆయన తెలిపారు. ఈ సంఘటనకు దేశం నివ్వెర పోగా ఇప్పటికీ వారాలు గడిచినా సుమోటోగా కేసు నమోదు కాకపోవడం పోలీసులు మౌనంగా ఉండటం శోచనీయమన్నారు. కనీస మానవ హక్కుల కమిషన్ సైతం స్పందించ లేదని ఈ ఘటనే దళితులకు రక్షణ లేదని స్పష్టంగా రుజువు చేస్తుందన్నారు. పైగా మేము మళ్లి దాడులు చేస్తామని సోషల్ మీడియా ద్వారా హెచ్చరిస్తుండటం దేనికి సంకేతమని కృష్ణమాదిగ ప్రశ్నించారు. ఛత్తీస్ గఢ్‌లో న్యాయమూర్తిని అవమానించారని కేసు నమోదు చేసిన వారికి చీఫ్ జస్టిస్ పై దాడి కనపడటం లేదా అన్నారు. నవంబర్ ఒకటిన ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఎక్కడ జరగని రీతిలో ర్యాలీ జరగనుందని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు విజయ్ మాదిగ, అంజయ్య మాదిగ, సునీల్ మాదిగ, నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# మధిర మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం



**ప్రజాపక్షం/ మధిర :** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ తీవ్రత మధిర మండలంలో పూర్తిగా కనిపించింది. మంగళవారం రాత్రి నుండి బుధవారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో గ్రామాలన్ని అస్తవ్యస్తంగా మారడంతో గ్రామాల ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. మండలంలో విస్తారంగా కురిసిన వర్షాలతో పంట పొలాలు నీట మునిగి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి రైతులు ఇప్పటికే అధిక వర్షాలతో దిగుబడి రాక ఆందోళన చెందే క్రమంలో ఈ తుఫాన్ మరింత ప్రభావం చూపించింది. మండలంలోని పత్తి, వరి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలకు తుఫాన్ ప్రభావంతో తీవ్ర నష్ట వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. మధిరలో కురిసిన భారీ వర్షం కారణంగా 2వ వార్డు ముస్లిం కాలనీ వరదనీటితో నీట మునగటంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. సిపిఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు మధిర వైరా ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో అధికారులు అక్కడికి చేరుకుని సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చి ఆందోళనను విరమింపచేశారు. అనంతరం ముస్లింకాలనీలో వరద నీటి బయటకు తీసేందుకు మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో యుద్ద ప్రతిపాదికన కాల్వ పనులు చేపట్టారు. మధిర పట్టణంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో జనజీవనం స్తంభించిపోయింది.

# ఎడతెరిపి లేని వర్షం.. స్తంభించిన జనజీవనం





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మొంథా తుపాన్ తీవ్రత తిరుమలాయపాలెం మండలంలో పూర్తిగా కన్పించింది. బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మండలంలోని గ్రామాలన్ని అస్తవ్యస్తంగా మారాయి. దీంతో గ్రామల ప్రజలు ఇండ్లకే పరిమితయ్యారు. మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం, కొక్కిరేణి, ఎర్రగడ్డ, తాళ్ళ చెరువు, దమ్మాయిగూడెం గ్రామాల్లో ఎక్కువగా మిర్చి పత్తి పంటుసాగు చేయగా బీరోలు, జూపెడ, బచ్చోడు, కాకరవాయి, హస్నాబాద్ , రఘునాధపాలెం, సుబ్లేడు, తదితర గ్రామాల్లో ఎక్కువగా వరి పంటలు సాగు చేశారు. ఈ తుఫాన్ ప్రభావం అన్ని పంటలపై పడిందని, వరి పొలాలకు కోతకు వచ్చే సమయంలో అకాల వర్షం అపార నష్టాన్ని మిగిలిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో చెరువులు, అలుగులు పోయడంతో రాకపోకలకు అంతరాయమేర్పడింది. తిరుమలాయపాలెం గ్రామంలో ఇండ్లలోకి వర్షపునీరు చేరడంతో తహశీల్దార్ లూథర్ విల్సన్, ఎంపిడిఓ ఎస్కే సిలార్‌సాహెబ్, ఎంపిఓ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి సుజాత జెసిబి సహాయంతో ఇండ్లలో చేరిన వర్షపు నీటిని తొలగించారు. కొక్కిరేణి గ్రామంలో ప్రధాన రహదారిపై చెరువునీరు చేరడంతో పంచాయతీ కార్యదర్శి భవ్య జెసిబి సహాయంతో కాలువ తీయించి వర్షపు నీటిని మళ్లీంచారు. ఆకేరు వెంట ఉన్న గ్రామాల ప్రజలకు అక్కడ పంచాయతీ కార్యదర్శులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఏరు పెరిగినట్లయితే వెంటనే పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో జరిగిన నష్టాన్ని మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని తెలిపారు.

# మొంథా తుఫాన్‌తో నీట మునిగిన వరి పంట



**ప్రజాపక్షం/కల్లూరుః** మెంథో తుఫానుకు మండల పరిధిలోని కప్పల బంధం, కల్లూరు, రఘునాథ బంజర తదితర గ్రామాలలో సుమారుగా 100 ఎకరాలలో వరి పంట నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారిని రూప తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న మెంథో తుఫాను వలన 100 ఎకరాలలో 50 మంది రైతులు నష్టపోయారని ఆమె తెలిపారు. ఒక ఎకరం 25000 పెట్టుబడితో పంటను కొనసాగించామని దీనివలన మరో రెండు రోజులు వర్షం పడితే పూర్తిగా నష్టపోయే అవకాశం ఉందని, కావున రైతులు కాలిబాటను పంట పొలంలో ఏర్పాటు చేసుకొని నీటిని బయటికి పంపించేయాలని ఆమె రైతులకు సూచించారు. దీనికి గాను వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలని ఆమె రైతులకు వివరించారు. పంట చేతికందే దిశలో ఈ విధంగా ఒకేసారి భారీ వర్షం ఈదురుగాలులతో రావడం వలన సొంతం, కౌలు పొలాలు పంట ఈ విధంగా నేల వాలడం వలన రైతులు ఆందోళనలో ఉన్నారు. అదే విధంగా పత్తి పంట కూడా అధిక వర్షాలతో రైతులు కూడా అదేవిధంగా ఉన్నారని ఏవో తెలిపారు. పత్తి పంట కూడా చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, మర్లపాడు, తెలగవరం, పోచవరం, టి. వెంకటాపురం తదితర గ్రామాలలో పత్తి పంట చేతికందే దశలో అధిక వర్షాల వలన అష్ట కష్టాలు పడాల్సి వస్తుందని కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు లేదని రైతులు తెలుపుతున్నారు.

# వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సిపి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** గత రెండురోజులుగు కురుస్తున్న భారీవర్షాలకు వచ్చే వరదలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ సూచించారు. బుధవారం మండల పరిదిలోని తీగలబంజర వద్ద గల పగిడేరు వరద ప్రవాహాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు మండల పరిదిలోని అంజనాపురం వద్ద నిమ్మవాగులో డిసిఎం వ్యాన్ పడిపోవడంతో స్థానిక పోలీసులు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని అప్రమత్తం చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, ఏర్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని నీటమునిగి రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఎగువప్రాంతాల్లో అధిక వర్షాల కారణంగా మున్నేరు వరద ఉధృతి పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రజలుకూడా అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అత్యవసరమైన పనిఉంటే తప్ప ప్రజలు ఇంటినుంచి బయటకు రావద్దని తెలిపారు.

# చాంబర్ ఎన్నికలకు 118 నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలకు సంబంధించి 76 పదవులకు 118 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి పిబి శ్రీరాములు తెలిపారు. బుధవారం చివరి రోజు 37 నామినేషన్లు దాఖలైనట్లు ఆయన తెలిపారు. చాంబర్ అధ్యక్ష పదవికి నాలుగు, ప్రధాన కార్యదర్శి పదవికి రెండు, ఉపాధ్యక్ష పదవికి రెండు, సహయ కార్యదర్శి పదవికి రెండు, కోశాధ్యక్షుని పదవికి మూడు, సెంట్రల్ ఈసి పదవికి 10, మిగిలిన శాఖలకు సంబంధించి 95 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. చివరి రోజు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు ప్యానెల్‌కు సంబంధించి అధ్యక్షునిగా మేళ్లచెరువు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా జివై నరేష్, కోశాధ్యక్షులుగా తల్లాడ రమేష్ లతో పాటుఈసి మెంబర్లు, వివిధ శాఖల అధ్యక్ష,కార్యదర్శుల పదవులకు నామినేషన్లు దాఖలు చేశారు.

# పునరావాస కేంద్రాలకు తరలింపు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం మున్నేరు పరివాహక ప్రాంతంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ఖమ్మం నగరంలోని మున్నేరు నది 19 అడుగులు చేరింది. పైనుంచి వరదలు రావడంతో మరింత పెరిగే అవకాశం ఉండడంతో ఖమ్మం కార్పోరేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులను ముంపు ప్రాంత బాధితులను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# పలు ప్రాంతాల్లో పర్యటించిన మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మేయర్ పునుకొల్లు నీరజ పర్యటించారు. బుధవారం నగరంలోని 11, 50 డివిజన్లలో మేయర్ పర్యటించా రు. మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్రైనేజీలు నిండి రోడ్లపైకి నీరు, కవిరాజ్ నగర్ ప్రాంతంలో ఇండ్లలోకి నీరు చేరింది. అదేవిధంగా రాపర్తి నగర్, పెట్రోల్ బంక్ ప్రాంతంలో ప్రధాన రహదారిపైకి నీరు చేరి వాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు. మేయర్ ఆయా ప్రాంతాలను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జేసిబిల సాయంతో డ్రైనేజీలపై ఉన్న ర్యాంపులు తొలగించి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ అనిల్ కుమార్, కార్పొరేటర్ రాపర్తి శరత్, నాయకులు సరిపూడి సతీష్, ఈఈ కృష్ణలాల్, హార్టికల్చర్ ఆఫీసర్ రాధిక, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లంకాసాగర్ ప్రాజెక్టు సందర్శన



**ప్రజాపక్షం/పెనుబల్లిః** పెనుబల్లి మండల పరిధిలోని లంకాసాగర్ ప్రాజెక్ట్‌ను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ప్రాంగణంలో సమగ్ర ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లోని వరద పరిస్థితులు, నీటి నిల్వ స్థాయిలు, ప్రవాహ నియంత్రణ వ్యవస్థలు, అలాగే భవిష్యత్తులో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలను విపులంగా విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు పాల్గొన్నారు.

# లొంగిపోయిన 51 మంది మావోయిస్టులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆయుధాలతో పాటు 51 మంది మావోయిస్టులు పోలీసులు ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో 42 మంది పురుషులు ఉండగా, 8 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. వీరందరిపై కలిపి మొత్తం రూ.66 లక్షల రివార్డు ఉన్నట్లు ఆరాష్ట్ర పోలీస్ వర్గాలు తెలిపాయి. వరుస లొంగుబాట్లతో మావోయిస్టు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. ఇటీవల కాలంలో కేంద్ర కమిటీ సభ్యులతో పాటు పలు క్యాడర్లకు చెందిన మావోయిస్టులు లొంగుబాట పట్టారు.